సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024



కిలో టమాట రూ.50

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.50, కనిష్టంగా రూ.24 ప్రకారం ధర పలికింది.



కూరగాయల రైతు కుదేలు

మార్కెట్‌లో ధరల హెచ్చు తగ్గుల కారణంగా కూరగాయల రైతు కుదేలయ్యాడు. ఆరుగాలం పండించిన కాయగూరలకు ఆదాయం రాక పోగా, పెట్టుబడులూ నష్టపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. IIలో

గరిష్టం/కనిష్టం
35.5°/22.3°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గి ఉక్కపోత పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

'పుడా' వైస్ చైర్మన్‌గా జేసీ అభిషేక్ కుమార్



జేసీ అభిషేక్‌కుమార్‌ను మరాద్య పూర్వకంగా కలసిన పుడా అధికారులు

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థ (పుడా) వైస్ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 'పుడా'తో పాటు రాష్ట్రంలోని 13 పట్టణాభివృద్ధి సంస్థల్లో వైస్ చైర్మన్‌ల బాధ్యతలను కూడా ఆయా జిల్లాల అధికారులకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా గురువారం పుడా డిప్యూటీ డైరెక్టర్ మల్లయ్య, ఏఓ నర్సారెడ్డి, టీపీఏ రేవాపతి, ప్లానింగ్ సెక్రెటరీ అనిల్ కుమార్, తదితరులు కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

మద్యం 'లాటరీ డ్రా'కు పటిష్ట బందోబస్తు



సాయి ఆరామం పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎక్సైజ్, పోలీస్ అధికారులు

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని సాయి ఆరామంలో ఈనెల 14వ తేదీ జరగనున్న మద్యం దుకాణాల లాటరీ డ్రా కార్యక్రమానికి పటిష్టబందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్, డీఎస్పీ విజయకుమార్ తెలిపారు. గురువారం లాటరీ డ్రా జరిగే సాయి ఆరామం పరిసర ప్రాంతాలను ఎక్సైజ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాల అనుమతులకు దరఖాస్తులకు ఆహ్వానించారన్నారు. 11వ తేదీతో దరఖాస్తుల ప్రక్రియ ముగుస్తుందని పేర్కొన్నారు. ఈనెల 14న పుట్టపర్తి పట్టణంలో సాయిఆరామంలో కలెక్టర్ టీఎస్ చేతన్ అధ్యక్షతన జిల్లా వ్యాప్తంగా 87 మద్యం దుకాణాలను లాటరీ విధానం ద్వారా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. లాటరీ విధానం పారదర్శకంగా నిర్వహిస్తామని, ఎవరైనా గొడవలకు దిగితే మాత్రం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

- ఎస్పీ వి.రత్న



మాట్లాడుతున్న ఎస్పీ రత్న

కదిరి టౌన్: బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ వి.రత్న అన్నారు. గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాల కార్మికులను సంరక్షించేందుకు చేపట్టిన ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశానికి కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి అధ్యక్షతన వహించగా అతిథిగా ఎస్పీ హాజరయ్యారు. ఈ సందర్భంగా పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ రత్న మాట్లాడుతూ కదిరి పట్టణంలో వివిధ హోటళ్లు, వెల్డింగ్ షాపులు, మాల్స్‌లో పనిచేసే 56 మంది బాల కార్మికులను గుర్తించామన్నారు. వారందరూ బాగా చదువుకుని మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం బాల కార్మికులకు రెండు జతల దుస్తులు ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ జహీరుద్దీన్, సమత స్వచ్ఛంద సంస్థల కోఆర్డినేటర్ శ్రీనివాసులునాయుడు, రూరల్ సీఐ మోహన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో పలువురి బదిలీలు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)లో పలువురు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వారిని కీలకమైన విభాగాలకు బదిలీ చేయడం గమనార్హం. వాస్తవానికి ఇన్‌చార్జ్ వీసీకి బదిలీ చేసే అధికారం లేకపోయినప్పటికీ బదిలీలు చేపట్టడం వివాదస్పదంగా మారుతోంది.



మడకశిర: దుర్గాదేవి అలంకరణలో పెడిసిలమ్మ



ధర్మవరం: మీనాక్షిదేవిగా దర్శనమిస్తున్న వాసవీమాత



హిందూపురం: దుర్గాదేవిగా చౌడేశ్వరీదేవి

జగజ్జననీ పాహి.. పాహి

జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా అమ్మవారి ఆలయాల్లో గురువారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రూపాల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. కదిరి పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం రాత్రి మోహిని అలంకారంలో ఖాద్రీశుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు అన్ని ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. శుక్రవారం దుర్గాష్టమి కావడంతో ఆయుధ పూజ చేసేందుకు అన్నిచోట్లా ఏర్పాట్లు చేశారు.

– సాక్షిబృందం,శ్రీసత్యసాయి జిల్లా



కదిరి: మోహిని అలంకారంలో ఖాద్రీశుడు

మద్యం దుకాణాలకు టెండర్



- దరఖాస్తు వేస్తే తాటతీస్తామంటున్న టీడీపీ నేతలు
- భయంతో ముందుకురాని ఆశావహులు
- జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి

08 జిల్లాలో ఎక్సైజ్ స్టేషన్లు

87 ఏర్పాటు చేయనున్న మద్యం దుకాణాలు

పుట్టపర్తి టౌన్/లేపాక్షి: మద్యం షాపులను దక్కించుకొని అందినకాడికి దోచుకోవాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు కొందరు టీడీపీ నాయకులు. టెండర్.. వేసేందుకు వచ్చిన వారిని బెదిరిస్తుండటంతో దరఖాస్తుల సంఖ్య కూడా తగ్గిపోయింది. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

87 దుకాణాలకు 1,039 దరఖాస్తులు

జిల్లాలో ఇప్పటి వరకు 87 దుకాణాలకు సంబంధించి 1,039 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఈనెల 7వ తేదీ వరకూ మందకొడిగా సాగిన దరఖాస్తుల ప్రక్రియ 9వ తేదీన ఊపందుకుంది. ఆ తర్వాత గురువారం అంతంత మాత్రంగానే దరఖాస్తులు అందాయి. చివరిరోజు మరింత ఊపొచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. జిల్లాలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఎవరూ మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోకుండా టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారు. దరఖాస్తుకు నేడే ఆఖరి రోజు కావడంతో ఒకరిద్దరితో దరఖాస్తు వేయించి మద్యం దుకాణాలను దక్కించుకోవాలని ప్లాన్ వేసినట్లు సమాచారం.

బాలయ్య ఇలాకాలో బెదిరింపులు

ముఖ్యమంత్రి చంద్రబాబు బావమరిది, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఇలాకాలో 'తెలుగు తమ్ముళ్లు' బరితెగించారు. మద్యం దుకాణాల టెండర్లలో సిండికేటుగా మారి ఎవరినీ దరఖాస్తు చేయనీయకుండా బెదిరింపులకు దిగుతున్నారు. గతంలో లేపాక్షి మండలంలోని 10 షాపులకు 107 దరఖాస్తులు రాగా.. ప్రస్తుతం 10 మంది మాత్రమే దరఖాస్తు చేయడం దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు. కాదు.. కూడదని దరఖాస్తు చేస్తే బెండు తీస్తామని బెదిరించినట్లు కొందరు వాపోతున్నారు. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం ఐదుగురు సభ్యులుగా ఏర్పడి తలా కొన్ని షాపులు తీసుకోవాలనే ప్లాన్‌లో ఉన్నట్లు తెలిసింది. ఔత్సాహికులు ఉన్నప్పటికీ టీడీపీ నేతల బెదిరింపులతో ముందుకు రావడం లేదని స్పష్టంగా తెలుస్తోంది.

'తమ్ముళ్ల' కనుసన్నల్లోనే..

జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలకు టెండర్ వేసే ప్రక్రియ మొత్తం ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులు.. వారి పీఏలు, అనుచరుల కనసన్నల్లోనే జరుగుతోంది. ఇందులోనూ కుల సమీకరణాలు తెరపైకి వచ్చాయన్న విమర్శలు ఉన్నాయి. టెండర్లు వేయాలంటే తాము చెప్పినట్లు వినాలని.. అలాంటి వారికే అవకాశం ఇస్తామని టీడీపీ నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని టెండర్లు దక్కించుకున్నా.. నిర్వహణ కష్టంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో దరఖాస్తులు తగ్గాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

నేటితో ముగియనున్న గడువు

నూతనంగా ఏర్పాటు కానున్న మద్యం దుకాణాలకు దక్కించుకొనేందుకు దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారంతో ముగియనుంది. ఇప్పటి వరకు జిల్లాలోని 87 దుకాణాలకు సంబంధించి మొత్తం 1,039 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బార్ల నిర్వాహకులు ఉన్నట్లు తెలిసింది. ఈనెల 14వ తేదీన పుట్టపర్తిలోని సాయి ఆరామంలో కలెక్టర్ అధ్యక్షతన లాటరీ విధానంలో దుకాణాలకు అనుమతులు మంజూరు చేయనున్నారు. పూర్తయిన తర్వాత మరుసటి రోజు పాత పాలసీ రద్దు చేసి కొత్త పాలసీ ప్రారంభించనున్నారు. ఈనెల 16వ తేదీ నుంచి కొత్త పాలసీ విధానం అమల్లోకి రానుంది.

మద్యం దరఖాస్తులు ఇలా..

7వ తేదీ	380
8వ తేదీ	457
9వ తేదీ	940
10వ తేదీ	1,039

ఉత్సవాలను విజయవంతం చేయండి



కళాకారులతో కలెక్టర్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

లేపాక్షి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లేపాక్షిలో నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి వీరభద్రస్వామి ఆలయం ఉత్తర మాడ వీధిలో జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి రోజు దసరా సంబరాలు–2024కి సంబంధించిన కార్యాక్రమాలను ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో అలరించాయి. సర్పంచ్ ఆదినారాయణ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, టూరిజం అధికారి జయ కుమార్‌బాబు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

19న జెడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19న సమావేశం నిర్వహించాలని జెడ్పీ పాలకవర్గం, అధికారులు నిర్ణయించారు. జూలై 9న జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 101 రోజుల తరువాత మళ్లీ ఇప్పుడు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. 90 రోజులకోసారి (మూడు నెలలు) సర్వసభ్య సమావేశం నిర్వహించాలి. అయితే జెడ్పీ అధికారులు ఎప్పుడూ ఈ నిబంధన పాటించ లేదు. తమకు నచ్చినట్లు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈసారి భారీ సంఖ్యలో పోలీసులు కూడా మోహరించనున్నట్లు తెలుస్తోంది.

పండుగ వాతావరణంలో 'పల్లె పండుగ'

- కలెక్టర్ టీఎస్ చేతన్



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14 నుంచి 20 వరకూ పల్లె పండుగ – పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను అదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కోర్టు హాల్‌లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డ్వామా, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, జిల్లా పంచాయతీ అధికారులు, ఎంపీడీఓలు, పంచాయతీ సెక్రెటరీలు, ఏపీఓలు, వివిద శాఖల ఇంజనీరింగ్ అధికారులతో పల్లె పండుగ – పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు సమన్వయం చేసుకుని లోటుపాట్లు లేకుండా నిర్వహించాలన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామీణ నీటిసరఫరా, పంచాయతీరాజ్ శాఖల ద్వారా గ్రామస్థాయిలో పనులను పూర్తి చేయాలన్నారు. డ్వామా ఆధ్వర్యంలో 32 మండలాల పరిధిలో 436 పంచాయతీల్లో 1152 పనులకుగాను రూ.78 కోట్ల ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, డీపీఓ సమత, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ పతనం ఖాయం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో పతనం కావడం ఖాయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ తెలిపారు. గురువారం మండలంలోని పత్తికుంటపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో క్యాలెండర్ ప్రకారం చెప్పిన సమయానికి సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. ఉచిత బస్సు, అమ్మకు వందనం, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లతో పాటు ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. తన అసమర్థ పాలనపై ప్రజలు దృష్టిని మళ్లించడానికి తిరుమల లడ్డూ వ్యవహారం తెరపైకి తెచ్చారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మద్యం మాఫియాను పెంచి పోషించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని, ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సిద్ధలింగప్ప, సర్పంచులు నిర్మలమ్మ, జిలాన్‌ఖాన్, కిష్టప్ప, సోము, కోఆప్షన్ సభ్యుడు రఫిక్, నాయకులు రమాకాంత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మంజు, తిమ్మారెడ్డి, కిష్టప్ప, శివారెడ్డి, అశ్వర్థరెడ్డి, రామచంద్రారెడ్డి, ప్రభాకర్, మద్దిలేటి, ఇబ్రహీం పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో ప్రభుత్వ టీచర్‌కు జైలు శిక్ష



పెనుకొండ: చెక్ బౌన్స్ కేసులో హిందుపురానికి చెందిన మహిళా ఉపాధ్యాయినికి పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బొజ్జప్ప ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. పెనుకొండ పోలీసుల వివరాలమేరకు.. 2022లో పెనుకొండ మండలం గుట్టూరుకు చెందిన ఈశ్వరమ్మకు హిందూపురానికి చెందిన ఉపాధ్యాయిని అంజనీ లక్ష్మీకళ డబ్బు ఇవ్వాల్సి ఉండగా చెక్‌ను ఇచ్చింది. అయితే చెక్ బౌన్స్ కావడంతో కొంతకాలం వేచి చూసిన ఈశ్వరమ్మ పెనుకొండ కోర్టును ఆశ్రయించింది. కేసు విచారణ పూర్తికావడంతో న్యాయమూర్తి బొజ్జప్ప ప్రభుత్వ టీచర్ అంజనీ లక్ష్మీకళకు ఆరు నెలల సాధారణ జైలుశిక్ష, 13,44,000 (పద మూడు లక్షలా నలభై నాలుగు వేలు) అపరాధ రుసుం విధిస్తూ తీర్పు వెలువరించారు.



ఆత్మకూరు వద్ద పూలు కోస్తున్న కూలీలు

పూల ధరలకు రెక్కలు

హిందూపురం అర్బన్/ఆత్మకూరు: శరన్నవరాత్రుల నేపథ్యంలో పూల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మరీ ముఖ్యంగా నేడు, రేపు ఆయుధ పూజ, దసరా కావడంతో పూలను కొందామనుకునేవారికి ధరలు షాక్ ఇస్తున్నాయి. ఏటా ఈ సమయంలో కర్ణాటక, తమిళనాడు నుంచి పూలను వ్యాపారులు దిగుమతి చేసుకునేవారు. అయితే అక్కడ కూడా వర్షాలు పడటంతో పూలు ఇక్కడికి సరఫరా కాలేదు. దీంతో అన్ని రకాల పూలకు డిమాండ్ ఏర్పడింది. వాహనాలకు వేసే హారాలు ఒక్కొక్కటి రూ.300 నుంచి 500 వరకు, పెద్దవి రూ. 500 నుంచి 1000 వరకు పలుకుతున్నాయి. కనకాంబరం కిలో రూ.1500, మల్లె పూలు కిలో రూ.1000, చెండు పూలు కిలో రూ.100, బటన్స్, గులాబీ, గోల్డ్, చిన్న మల్లెపూలు కిలో రూ. 300 నుంచి 400తో అమ్మకాలు చేస్తున్నారు. ధర ఎంత ఉన్నప్పటికీ పూజకు పూలు అవసరం కాబట్టి ప్రతి ఒక్కరూ కొనుగోలు చేస్తున్నారు.







హిందూపురం మార్కెట్లో పూలు కొనుగోలు చేస్తున్న దృశ్యం , హిందూపురంలో అమ్మకానికి ఉంచిన మల్లె, కనకాంబరం, చామంతి పూలు

క్లుప్తంగా

నిజాయితీ చాటుకున్న పెయింటర్


చెన్నప్ప

అమరాపురం: నడిరోడ్డుపై తనకు లభించిన రూ.2.50 లక్షలను సంబంధీకులకు అందజేయాలంటూ పోలీసులకు అప్పగించి ఓ పెయింటర్ తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాలు... అమరాపురంలో నివాసముంటున్న పెయింటర్ చెన్నప్ప గురువారం ఉదయం స్థానిక మడకశిర రోడ్డులో ఉన్న యూనియన్ బ్యాంక్ సమీపంలో వెళుతుండగా రోడ్డుపై పడి ఉన్న రూ.500 నోట్ల కట్టలు కనిపించాయి. దీంతో ఆయన వాటిని తీసుకుని పరిశీలించారు. మొత్తం ఐదు కట్టల్లో రూ.2.50 లక్షలు ఉన్నట్లుగా నిర్ధారించుకున్న అనంతరం సంబంధీకులు ఎవరైనా వస్తారేమోనని కాసేపు అక్కడే వేచి చూశారు. చివరకు ఎవరూ రాకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఏఎస్‌ఐ రామాంజనేయులుకు అప్పగించారు. ఈ అంశం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో గమనించిన స్థానికులు చెన్నప్పను అభినందిస్తున్నారు.

జూదరుల అరెస్ట్

గోరంట్ల: మండలంలోని బోయిలపల్లి తండా సమీపంలో ఎర్రకొండ వద్ద గురువారం జూదమాడుతున్న 14 మందిని పోలీసులు అరెస్ట్ చేసి, రూ.1,03,365 నగదు, పది ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు.

కూరగాయల రైతు కుదేలు

- ధరల హెచ్చు తగ్గులతో నష్టాలు
- పెట్టుబడులు కూడా చేతికి అందడం లేదంటున్న రైతులు


హిందూపురం వద్ద సాగు చేసిన ఎండుమిర్చి


మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న టమాట

పుట్టపర్తి అర్బన్: మార్కెట్‌లో ధరల హెచ్చు తగ్గుల కారణంగా కూరగాయల రైతు కుదేలయ్యాడు. ఆరుగాలం పండించిన కాయగూరలకు ఆదాయం రాకపోగా, పెట్టిన పెట్టుబడులూ నష్టపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ధరలు బాగున్నాయని కూరగాయల సాగు చేపడితే పంట కోతకు వచ్చే సమయానికి ధరలు పతనమవడంతో చాలా మంది రైతులు మనోవేదనకు గురవుతున్నారు. కూరగాయల మార్కెట్‌లో దళారుల హవా అధికం కావడంతో ధరలు ఇష్టానుసారంగా తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌కు సరుకు తీసుకెళ్లగానే వ్యాపారులంతా కుమ్మక్కై ధర తగ్గించి కొనుగోలు చేస్తూ రైతులు నష్టపోయేలా చేస్తున్నారు.

ఎకరాకు రూ.లక్షల్లో ఖర్చు

జిల్లాలో అన్ని రకాల కూరగాయలు సుమారు 50 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇందులో ముఖ్యంగా టమాట, వంకాయ, మిరప, కాకర, బీర, ఉల్లి, క్యాలీఫ్లవర్, క్యాబేజీ తదితర పంటలను అధికంగా సాగు చేస్తున్నారు. అత్యధికంగా టమాట 11,391 హెక్టార్లు, ఉల్లి 374 హెక్టార్లు, మిరప 1,248 హెక్టార్లు, ఎండు మిర్చి 1,433 హెక్టార్లు, చిక్కుడు 331 హెక్టార్లు, ఆలుగడ్డ 88 హెక్టార్లు, వంకాయ 356 హెక్టార్లలో సాగులో ఉన్నాయి. కూరగాయలకు మార్కెట్‌లో ఈ రోజు ఉన్న ధర మరో రోజు ఉండడం లేదు. ధరల హెచ్చు తగ్గులతో కొన్ని పంటలు సాగు చేయాలంటేనే రైతులు భయపడే పరిస్థితి వచ్చింది. టమాట, వంకాయ, మిరప, కాకర, బీర, చిక్కుడు తదితర కూరగాయల ధరల్లో నిత్యం గందరగోళంగా ఉంటోంది. ఒక్కో కూరగాయల పంటకు ఎకరాకు రూ.లక్షల్లో రైతులు ఖర్చు పెడుతున్నారు. పంట సాగు చేసినప్పటి నుంచి చీడపీడల నివారణ, ఇతర యాజమాన్య ఖర్చులు కలిపి తడిసి మోపెడవుతోంది. వర్షాలు కురిస్తే కూరగాయలకు విపరీతమైన రోగాలు వ్యాపిస్తాయి .వీటిని తట్టుకునేందుకు వేలాది రూపాయల ఖర్చు చేసి మందులు పిచికారీ చేస్తున్నారు.

నాడు ధరల స్థిరీకరణ నిధితో ఆదుకున్న వైఎస్ జగన్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర లేనప్పుడు రైతులను ఆదుకుంటూ వచ్చారు. దీంతో గత ఐదేళ్లు ధరల్లో పెద్దగా హెచ్చు తగ్గులు కనిపించలేదు. మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న, రాగులు, జొన్న, రైతు బజార్ల ద్వారా టమాట, ఉల్లిగడ్డలు తదితర కూరగాయలను కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నారు. దీంతో ఇటు రైతులు, అటు కొనుగోలుదారులకు ఇబ్బంది లేకుండా చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతుల బాగోగులను సీఎం చంద్రబాబు గాలికి ఒదిలేశారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రైతు సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయక, ఇచ్చిన హామీలు నెరవేర్చక అన్నదాతలను అన్ని విధాలుగా వంచనకు గురి చేస్తూ వచ్చారు. కూరగాయల ధరలు పెరిగినా... తగ్గినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలో కనీసం మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో పంట దిగుబడులను పక్క రాష్ట్రాలకు తరలించి అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదృష్టంపై ఆధారపడింది



కూరగాయల సాగు అనేది అదృష్టంపై ఆధారపడి ఉంటోంది. ఒక రోజు అధిక ధరలు ఉంటే మరో రోజు కనీసం కూలీల ఖర్చు కూడా చేతికి అందనంత పరిస్థితి ఉంటోంది. దీంతో పంట మార్కెట్‌కు తరలించాలంటేనే భయమేస్తోంది. స్థానికంగా ప్రాసెసింగ్ యూనిట్లు, మార్కెట్లు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

– నరసింహారెడ్డి, రైతు, వెంకటగారిపల్లి

ధరల స్థిరీకరణ ఉండాలి



ధరలను స్థిరీకరిస్తే నిత్యం గిట్టుబాటు ధరలు ఉంటాయి. ఏడాది పొడవునా ఇంచుమించు ఒకే ధరను కొనసాగిస్తే మరింత మంది రైతులు ముందుకు వచ్చి కూరగాయలు సాగుచేపడతారు. జిల్లాలో మార్కెట్ సదుపాయం లేదు. దీంతో కర్ణాటక, తమిళనాడు, ఇతర జిల్లాల మార్కెట్లపై ఆధారపడాల్సి వస్తోంది. అధికారులు కూడా ఏ సీజన్‌లో ఏ పంట సాగు చేయాలో ముందుగా తెలియజేస్తే బాగుంటుంది.

– జనార్దన్, కూరగాయల రైతు, పెడపల్లి

'సెల్'లో మానవ సంబంధాలు బందీ

- సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్‌యాదవ్


మాట్లాడుతున్న న్యాయమూర్తి శివప్రసాద్‌యాదవ్

అనంతపురం మెడికల్: సెల్‌ఫోన్ బంధాలకే యువత ఎక్కువ ప్రాధాన్యతనిస్తుండడంతో మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తోందని సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ అభిప్రాయపడ్డారు. దీంతో మానవ సంబంధాలు సెల్‌ఫోన్‌లో బందీఖానా అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మానసిక ఆరోగ్యంతోనే మెరుగైన సమాజం నెలకొంటుందని అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్యం దినాన్ని పురస్కరించుకుని అనంతపురం సైకియాట్రిక్ సొసైటీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇన్నర్ వీల్ క్లబ్, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అనంతపురంలోని ఐఎంఏ హాల్‌లో మానసిక ఆరోగ్యంపై సదస్సు నిర్వహించారు. అంతకు ముందు ఐఎంఏ హాల్ నుంచి ప్రభుత్వ సర్వజనాస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించి, విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సదస్సులో వక్తలు మాట్లాడుతూ.. మంచి కుటుంబం, మిత్రులు, గురువులు సహచర్యంలో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రశాంతమైన జీవితం కోసం యోగ, ప్రాణాయామం , సానుకూల దృక్పథం వంటివి అలవర్చుకోవాలన్నారు. డాక్టర్ యండ్లూరి ప్రభాకర్ మాట్లాడుతూ... సత్ప్రవర్తన, చేయూత, ప్రేమ, కరుణ, దయ కలిగి ఉండాలన్నారు. అనంతరం వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన 40 మందికి ప్రశంసా పత్రాలు, మెమొంటోలను సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మురళీకృష్ణ, నాయకులు డాక్టర్ సుప్రజ చౌదరి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

హిందూపురం అర్బన్: స్థానిక శ్రీకంఠపురానికి చెందిన సంజీవరాయప్ప (45) ఆత్మహత్య చేసుకున్నాడు. తరచూ కడుపునొప్పి వస్తుండడం, మరో వైపు పిల్లల చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురు కావడం, దివ్యాంగురాలైన భార్య సంజీవమ్మ పోషణ కష్టం కావడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన గురువారం స్థానిక పులమతి రోడ్డులో ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు రెండో పట్టణ ఎస్‌ఐ అక్బర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రోకలి బండతో మోది... భర్తను హతమార్చి!


గోవిందు (ఫైల్)

ధర్మవరం రూరల్: మండలంలోని ధర్మపురికి చెందిన ఎరికల గోవిందు (56) దారుణ హత్యకు గురయ్యాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆయన భార్య అంజనమ్మ రోకలి బండతో తలపై దాడి చేయడంతో గోవిందు అక్కడికక్కడే మృతి చెందాడు. మూడు రోజులుగా ఆస్తి తగాదాలతో దంపతులు తీవ్ర స్థాయిలో గొడవ పడేవారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం మరోసారి దంపతుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఆ సమయంలో క్షణికావేశానికి లోనైన అంజనమ్మ చేతికి అందుబాటులో ఉన్న రోకలిబండ తీసుకుని గోవిందు తలపై బలంగా మోదింది. ఘటనలో తల పగిలి గోవిందు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ధర్మవరం రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. హతుడి భార్యను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. కాగా, హతుడికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

సత్యసాయి అంటే రతన్‌టాటాకు అమిత భక్తి


సత్యసాయి ఆశీర్వాదం తీసుకుంటున్న రతన్‌టాటా (ఫైల్)


రతన్‌టాటాతో హిందూపురం నివాసి బాషా

ప్రశాంతి నిలయం: భారతీయ వ్యాపార దిగ్గజం, టాటా సంస్థల అధినేత రతన్‌టాటాకు సత్యసాయిబాబా అంటే అమితమైన భక్తి. సత్యసాయి సేవలను స్ఫూర్తితో ఆయన పలు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాబా ట్రస్ట్ సేవల్లో తానూ ఓ భాగమయ్యారు. సత్యసాయితో ఎంతో అనుబంధం కొనసాగించిన రతన్‌టాటా మృతి విషయం తెలుసుకుని సాయి భక్తులు శోకసంద్రంలో మునిగిపోయారు.

టాటా సాంకేతిక పరిజ్ఞానంతో..

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని దేశంలోని విద్యారంగంలో సమూల మార్పులు తీసుకురావాలన్న సంకల్పంతో సత్యసాయిబాబా 2010, నవంబర్ 23న విద్యావాహిని పేరుతో నూతన ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశీయంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సౌకర్యాలకు నోచుకోని విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించాలని సంకల్పించారు. అప్పట్లో హిల్‌వ్యూ స్టేడియం వేదికగా ఈ కార్యక్రమాన్ని సత్యసాయి ప్రకటించి, ప్రారంభించారు. సత్యసాయి మానస పుత్రికగా పేర్కొన్న ఈ కార్యాచరణను టాటా సంస్థల సౌజన్యంతో కొనసాగించాలని నిర్ణయించారు. అప్పటికే సమాజ సేవలో అన్నింటా ముందు వరుసలో ఉన్న రతన్‌టాటా సైతం సత్యసాయి సూచనను అంగీకరించి విద్యా వాహిని ప్రాజెక్ట్‌కు సాంకేతిక సహకారాన్ని అందించారు. నాటి నుంచి నేటి వరకూ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యావాహిని ప్రాజెక్ట్‌కు సాంకేతిక సహకారాన్ని ఉచితంగా అందిస్తూ వస్తున్నారు.

'పురం'తో ప్రత్యేక అనుబంధం

హిందూపురం: రతన్‌టాటాకు హిందూపురానికి ప్రత్యేక అనుబంధం ఉంది. 1982లో నెల్కో టీవీల విక్రయాల్లో రాయలసీమలోనే హిందూపురం మొదటి స్థానంలో నిలిచింది. దీంతో దుకాణ నిర్వాహకుడు ఎస్.బాషాను అభినందించేందుకు రతన్‌టాటా హిందూపురానికి విచ్చేశారు. ఈ నేపథ్యంలో రతన్‌టాటా జ్ఞాపకాలతో బాషా కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

యువకుడి బలవన్మరణం

ఓడీచెరువు: మండలంలోని గౌనిపల్లికి చెందిన నాగముని కుమారుడు కుమ్మరసాని జగదీష్ (30) ఆత్మహత్య చేసుకున్నాడు. ఉద్యోగం రాలేదన్న దిగాలుతో మానసికంగా కుదేలైన జగదీష్‌కు కుటుంబ సభ్యులు చికిత్స చేయించారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న జగదీష్ గురువారం ఉదయం తమ పొలంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పాముకాటుతో యువకుడి మృతి

నల్లచెరువు: మండలంలోని బొమ్మిరెడ్డిపల్లిలో పాముకాటుతో ఓ యువకుడు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు... రాట్నాలపల్లిలో నివాసముంటున్న విశ్వనాథ్‌రెడ్డి (35) బొమిరెడ్డిపల్లిలో వ్యవసాయ బోరు కింద పూల తోటను సాగు చేస్తున్నాడు. ఈక్రమంలో గురువారం తన తోటలో పనుల్లో నిమగ్నమై ఉన్నప్పుడు పాము కాటు వేసింది. బాధితుడి నుంచి విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు.

లింగ నిర్ధారిత వీర్యంతో ప్రయోజనాలు మెండు

- రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు


పెయ్య దూడల ప్రదర్శనలో పాల్గొన్న రైతులు

రాప్తాడు: లింగ నిర్ధారిత వీర్యంతో పశువుల్లో కృత్రిమ గర్భాధారణ ప్రక్రియ భవిష్యత్తులో అత్యధిక ప్రాచుర్యం పొందుతుందని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. రాప్తాడు మండలం మరూరులో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం పెయ్య దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడారు. అత్యధిక పాడి కోసం కేవలం పెయ్య దూడలే జన్మించేలా లింగ నిర్ధారిత వీర్యాన్ని వృద్ధి చేసినట్లు తెలిపారు. దూడలు త్వరగా ఎదిగేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పుట్టిన 15 పెయ్య దూడలు, సాధారణ వీర్యం ద్వారా పుట్టిన 35 దూడలను ప్రదర్శనలో ఉంచారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన మరూరు గ్రామ పాడి రైతులు ఓబిరెడ్డి, నర్సింహులు, కదిరప్పకు పాల క్యాన్లు అందజేశారు. పాడి పరిశ్రమలో పలువురికి ఆదర్శంగా నిలిచిన బండమీదపల్లి గ్రామానికి చెందిన పాడి రైతు ఉప్పర నరసింహులును ప్రత్యేకంగా సన్మానించారు.